సమస్యలతో సహవాసం

- 40వ డివిజన్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- కాలనీల్లో పందులు, దోమల స్వైరవిహారం

ఖిలా వరంగల్: 40వ డివిజన్ ఉర్సు నానామియా తోట, కుమ్మరివాడ, ఉప్పరోనికుంట, ఎల్లమ్మ తాళ్ల కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. డివిజన్‌లో ఎక్కడ చూసినా పడకేసిన పారిశుద్ధ్యం, గుంతలమయమైన రోడ్లు, కచ్చా డ్రెయినేజీలతో స్థానికులు సతమతం అవుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

రోగాల బారిన ప్రజలు

ప్రధాన రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించకపోవడంతో పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. దాంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడుతున్నాయని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఉర్సు కురమవీధిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం


ప్రగతినగర్‌లో నల్లరాళ్ల వద్ద..


వల్లభ్‌భాయ్ విగ్రహానికి వెళ్లే దారిలో..

సమస్యలు పరిష్కరించాలి



డివిజన్‌లోని కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. డ్రెయినేజీలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. గుంతలమయమైన రోడ్లపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదు.

- మరుపల్లి రవి, కార్పొరేటర్, 40వ డివిజన్

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సూచించారు. నగరంలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో క్రైమ్ రికార్డులు, సిబ్బంది కిట్లు, శానిటేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మెరుగైన విధులు నిర్వర్తించిన పలువురు సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

- పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్వీఎస్ కళాశాలలో కళాజాత బృందం ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. మొబైల్‌కు అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజీలు, లింక్‌లను స్పందించవద్దని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. అధ్యాపకుల సూచనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై హరిత, రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

విద్యారణ్యపురి: ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఆర్ఎస్సై నవీన్‌కుమార్ కోరారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం కంటే ప్రాణం విలువైనదని గుర్తుంచుకోవాలని సూచించారు. అనేక మంది వాహనాలను అతివేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రజనీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సురభి వినోద రావు, డాక్టర్ సంధ్యారాణి, ట్రాఫిక్ ఏఎస్సై వేణుగోపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శశికాంత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఆర్ఎస్సై

ముస్లింలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ముస్లిం ప్రతినిధులు

హన్మకొండ: ముస్లింలకు ఎమ్మెల్సీలుగా అవకాశాలు కల్పించాలని ముస్లిం ప్రతినిధులు కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన అంశాలను అమలు చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ ముస్లిం సంఘం ప్రతినిధులు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ముస్లింలకు పేర్కొన్న హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ముస్లింల సమస్యలు చెప్పుకోవడానికి ఒక ముస్లిం ప్రజాప్రతినిధి కూడా లేరని వాపోయారు. వచ్చే ఏడాది ఏడు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్న క్రమంలో వాటిలో మూడు పదవులు ముస్లింలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం ప్రతినిధుల బృందం నాయకులు మొహమ్మద్ నయీమొద్దీన్, మహమ్మద్ ఇస్మాయిల్, తస్లీం ఖానం, మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, అబిద్ హుస్సేన్, సర్దార్ అలీ అమీనబి రషత్ యాస్మిన్, యాకూబ్, అబ్దుల్లా ఖాన్, హసన్, అఫ్సర్, మజహర్ ఆరిఫ్ లాల్, మొహమ్మద్ అహ్మద్ రహీం, ఫెరోస్ ఇంతియాజ్, యూసుఫ్ పాల్గొన్నారు.

22న వరంగల్‌లో కాకతీయ కదనభేరి

- సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి / రామన్నపేట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలుచేయబోతున్న ఏకీకృత పింఛన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 22న వరంగల్‌లో కాకతీయ కదనభేరి నిర్వహించనున్నట్లు సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. హనుమకొండ రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో కదనభేరి వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఎస్ విధానానికి ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్1 నుంచి అమలుచేసే ఏకీకృత పింఛన్ విధానాన్ని వ్యతిరేకించాలని సూచించారు. ఈనెల 22న ఉద్యోగ, ఉపాధ్యాయులతో వరంగల్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున్, బాధ్యులు బుచ్చన్న, అఫ్జల్, కొండ శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, రవీందర్‌రెడ్డి, దిల్షాన్, శివ కోటి, రాజేందర్, సర్వమ్మ, సరళరాణి, అశ్విని, రాజు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక చేయూత



హన్మకొండ చౌరస్తా: ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న చిన్ననాటి మిత్రుడికి ఆర్థిక చేయూత అందించి తమ స్నేహబంధాన్ని స్నేహితులు చాటుకున్నారు. హనుమకొండ కొత్తూరుకు చెందిన ఆటోడ్రైవర్ జావేద్ తల్లి క్యాన్సర్ బారిన పడడంతో వైద్య ఖర్చులు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారింది. ఈక్రమంలో ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఆటోను ఫైనాన్స్ సిబ్బంది తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న మర్కజీ ఉన్నత పాఠశాలలో 1985లో ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గోకారపు శ్యామ్, బింగి సురేష్, రాంబాబు, శ్రీనివాస్, మధు, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన


కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

హసన్‌పర్తి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. అధికారులు ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఆరునెలల క్రితం ప్రజాపాలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఇళ్ల నిర్మాణానికి భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల వివరాలను అప్పుడే ఆన్‌లైన్ చేశారు. తాజాగా మండల వ్యాప్తంగా దరఖాస్తుల ప్రకియ చేపడుతున్నారు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో దరఖాస్తుల పరిశీలన తీరును మండల పరిషత్ అభివృద్ధికి అధికారి ప్రవీణ్, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి, హౌజింగ్ డీఈఈ సిద్ధార్థనాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, సభ్యులు జోరిక పూల, తాళ్లపల్లి రమాదేవి, రమేష్, గోపాల్, కొయ్యడ సునీల్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, కారోబార్ సదానందం, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా విజయకుమార్



దేశాయిపేట: తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తవాడకు ప్రాంతానికి చెందిన కటకం విజయకుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను గురువారం అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన బీసీ సంఘం నాయకులకు విజయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రావు పద్మపై ఆరోపణలు సరికావు

- బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు



సమావేశంలో మాట్లాడుతున్న సంద్ర మధు

హన్మకొండ: బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అనుయాయులు తప్పుడు ఆరోపణలు చేయడం.. వారి చిల్లర రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాజీపేట రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీపై వినయ్‌భాస్కర్‌కు అవగాహన లేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు పులి రజనీకాంత్, ఇతర నాయకులు స్థాయికి మించి విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టమైన వివరణలు వచ్చినా అవగాహన లేకుండా ఢిల్లీలో వినయ్‌భాస్కర్ ధర్నా చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఏడాదిన్నర క్రితమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రావు పద్మ, పార్టీ నాయకులు హనుమకొండకు ఆహ్వానించి కాజీపేటలో వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, తిరుపతి నాయక్, బొల్లేటి కృష్ణమాచారి, సంపత్ రెడ్డి, కత్తుల అనిల్, రవి నాయక్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం బాధ్యులు

విద్యారణ్యపురి: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని ఉద్యోగుల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు దొనికన శ్రీధర్‌గౌడ్, ఎండీ.షఫీ డిమాండ్ చేశారు. తొమ్మిది విభాగాల ఉద్యోగులు హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన నిరసన నిరసన దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలు, ఎంఆర్‌పీలలో పలు పనులు నిలిచిపోయాయన్నారు. 23 కేజీబీవీల్లో విద్యాబోధనను కూడా నిలిపివేస్తామని వారు పేర్కొన్నారు. సమ్మెకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రేగుల సహదేవ్, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సంఘీభావం తెలిపారు.

పైపులైన్ లీకేజీ.. వృథా అవుతున్న తాగునీరు

గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లోని సిరి వాటర్ ప్లాంట్ వీధిలో పైపులైన్ లీకేజీతో పదిరోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. ఈక్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లీకేజీలను అరికట్టాలని కోరినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మెయిన్ లైన్ కావడంతో గంటల తరబడి తాగునీరు రోడ్డు పాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మడికొండ


పైపులైన్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

సంక్షిప్తంగా

భగవద్గీత అనుసరణతో మానసిక ప్రశాంతత

హన్మకొండ: భగవద్గీతను ప్రతిరోజూ అనుసరించడం ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందని యోగా గురువు పోశాల శ్రీనివాస్ అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ స్కూల్‌లో భగవద్గీత పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు భగవద్గీత శ్లోకాలు నేర్పించడం ద్వారా ఉన్నతంగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం పోశాల శ్రీనివాస్‌ను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఎంఆర్ స్కూల్ చైర్మన్ ముక్తేశ్వర్, నాగిళ్ల వేణుశర్మ, తండ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బేకరీ మాస్టర్లు, వర్కర్లకు గుర్తింపు కార్డుల అందజేత

వరంగల్: వరంగల్ నగరంలోని బేకరీ మాస్టర్స్ అండ్ వర్కర్స్ యూనియన్‌లోని మాస్టర్లు, వర్కర్లకు గుర్తింపు కార్డులను ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షకుర్ అందజేశారు. ఎల్‌బీనగర్‌లోని కాస్మో ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాస్టర్లు.. వర్కర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ జిల్లా మైనార్టీ నాయకుడు అయూబ్ మాట్లాడుతూ త్వరలోనే లేబర్ కార్డులు అందిస్తామని కొండా దంపతులు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తాజొద్దీన్, కార్పొరేటర్ ఫుర్కాన్, నాయకులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నయీంనగర్: నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నేతకానీలకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, హైదరాబాద్‌లో నేతకాని ఆత్మగౌరవ భవనం నిర్మించాలని, నామినేటెడ్ పదవుల్లో నేతకానీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నేతకాని సమాజానికి 2 ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ సీటు ఇవ్వాలని కోరారు. కొద్దిరోజుల్లో హనుమకొండ జిల్లా కమిటీ ఏర్పాటు అవుతుందని, త్వరలో హైదరాబాద్‌లో నేతకాని సింహగర్జన సభ జరుగుతుందని అన్నారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్, సంఘం నాయకులు అనపర్తి యువరాజు, డీఎస్.నేత, బండారి చేరాలు, బండారి సురేష్, సారయ్య, రాజేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మహాసభ కరపత్రం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: ఈనెల 20న హనుమకొండలోని పల్ల రవీందర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల ఉమ్మడి వరంగల్ జిల్లా సభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) బాధ్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద మహాసభల కరపత్రాలను కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డు దయాకర్ మాదిగ, ఆయా సంఘాల బాధ్యులు చిరంజీవి, ముఖేష్, వడ్డెపెల్లి మధు, మంద భాస్కర్, బొడ్డు శాంతిసాగర్, రాణాప్రతాప్, గణేష్, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ మహిళా సంఘం వార్షిక సమావేశం

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ పడమరకోటలోని కొత్తగడ్డ ప్రాంతంలో బేర కవిత అధ్యక్షతన కాకతీయ మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మహిళా సంఘాలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం రుణాలు అందజేస్తోందని తెలిపారు. తీసుకున్న రుణాలను బ్యాంకులకు తిరిగి చెల్లించి మళ్లీ రాయితీలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సీఓ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్, అంగన్‌వాడీ రాజమణి పాల్గొన్నారు.

మంత్రి సురేఖను బర్తరఫ్ చేయాలి

వరంగల్: నిబంధనలకు విరుద్ధంగా గీసుకొండలోని గోశాలకు ఆవులను కేటాయించాలని సిఫార్సు చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర గవర్నర్‌కు పోస్ట్ కార్డులు రాసి పంపించామని వారు పేర్కొన్నారు. మంత్రి హోదాలో అలా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు సముద్రాల పరమేశ్వర్, నాయకులు రఘునరెడ్డి, జి.కుమార్‌యాదవ్, పి.ఆనంద్, కోమాకుల నాగరాజు, కట్టర్ సతీష్, శ్రీనివాస్, రతన్, నాగరాజుగౌడ్, భిక్షపతి, అజయ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు తరలిన వాసవిక్లబ్ ప్రతినిధులు

హసన్‌పర్తి: ఈనెల 14, 15వ తేదీల్లో తమిళనాడులోని మధురైలో నిర్వహించనున్న వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సదస్సుకు హసన్‌పర్తికి చెందిన క్లబ్ ప్రతినిధులు గురువారం తరలివెళ్లారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ నాగమళ్ల సుధీర్, వాసవిక్లబ్ హసన్‌పర్తి అధ్యక్షుడు శ్యాంసుందర్, కార్యదర్శి పురవర్ధన్ మధురైకి పయనమయ్యారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలి



కాజీపేట: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని మంచిగా చదువుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థి నిఖిత బోగా (ఐఎఫ్ఎస్) అన్నారు. కాజీపేట పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి 60వ వార్షికోత్సవాలను ఆమె ప్రారంభించారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వేమూరి అభిజ్ఞ, ప్రిన్సిపాల్ జులియ, కరస్పాండెంట్ సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూ పోలీసు స్టేషన్, పలివేల్పుల, సీఆర్ఎఫ్ క్యాంపు, టీబీ ఆస్పత్రి, కనకయ్య హోటల్, మహాత్మా నగర్, విజయగణపతి కాలనీ, వినాయక టెంపుల్ ప్రాంతం, హంటర్‌రోడ్డులోని టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, రాంకీ, దయానంద కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

14, 15వ తేదీల్లో శ్రీఅరబిందో సొసైటీ మహాసభలు



నయీంనగర్: హనుమకొండ శ్రీఅరబిందో సొసైటీ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ బండారి జగదీశ్‌బాబు, కార్యదర్శి వరిగొండ కాంతారావు తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సభ్యుల మహాసభలను ఈనెల 14, 15వ తేదీల్లో కాజీపేటలోని ఫాతిమానగర్ బాల వికాస కేంద్రంలో నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

భారత సేవారత్న అవార్డు ప్రదానం



దేశాయిపేట: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆడెపు రవీందర్‌కు అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్, సామాజిక న్యాయ సంస్థలు భారత సేవారత్న జాతీయ అవార్డును హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ 30 ఏళ్లగా కళాకారులకు అండగా ఉంటూ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు పంపిణీ చేస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వడ్నాల నరేందర్, మార్గం ఎల్లయ్య, కాసం నమఃశివాయ, గడ్డం కేశవమూర్తి, డాక్టర్లు కూరపాటి రమేష్, కటకం నరేందర్, మహేశ్వర్, ఈగ వెంకటేశ్వర్లు, రమేష్, కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

శ్వేతార్కలో సుబ్రహ్మణ్య కల్యాణం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో వల్లీ, దేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుకలను ఆలయ ప్రధాన అర్చకుడు అయిన వోలు సాయికృష్ణ శర్మ గురువారం జరిపించారు. దేవతామూర్తుల కల్యాణ వేడుకలను పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నపూర్ణ భవనంలో మహాన్నదానం చేశారు.

కాజీపేటలో మహాపడి పూజ



కాజీపేట / కాజీపేట రూరల్: కాజీపేట పట్టణంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజను సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రారంభించారు. డేగల శ్రీధర్ గురుస్వామి ఆధ్వర్యంలో తేజావత్ నవీన్ – కవిత దంపతులు చేపట్టిన పడిపూజకు సీపీ హాజరయ్యారు. అయ్యప్ప ఆలయ అర్చకులు ఉడుతల శ్రీనివాస్ శర్మ, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, నదీ జలాలతో అభిషేకం జరిపించారు. అయ్యప్ప స్వామికి సీపీ మహా నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో బుర్ర జనార్దన్ గౌడ్, పిల్లల కుమారస్వామి, కోటగిరి సంపత్ కుమార్, దండిగం సదానందం, పాము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విద్యారణ్యపురి: డాక్టర్ కేర్ హోమియోపతి సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల మైదానంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో వైద్యులు వాసం నిఖిల్‌తేజ, ప్రీతి పాల్గొన్నారు.